# చివరకేమిలేదు

శ్రీ వడ్డెంగుంట అంకయ్య

రాము సుశీల అన్యోన్య ప్రేమానురాగాలతో, చిలుక గోరంకల్లాగా సుమారు నాలుగేండ్లు గడిపారు. పాపం ఎందుకొచ్చిందో వచ్చింది వారిద్దరి మధ్య కీచులాట. రాము పట్టి బెట్టుసరి మనిషి. పైగా తన పట్టినకుందేటికి మూడేకాళ్లంటాడు. పోని సుశీలయినా సర్దుకుపోతుందేమోనంటె అట్లు సర్దుకుపోయె మనిషి కాదు. తన ముక్కుకు సూటిగపోయేది. ఒకరుచెప్పేది వినదు సరిగదా! నలుగురేమైన ననుకుంటారేమోనన్న భయంలేదు. తానుచేసిందల్ల మంచి పనేననుకుంటుంది. మాట్లడిందల్ల మంచిమాటేననుకుంటుంది.

ఇటువంటి తత్వముగలవారెంత చిలుక గోరంకల్లాగున్నా, ఎంత మెలివేసిన త్రాడులాగున్నా, ఎంత ప్రేమానురాగాలతో నీవే నేను, నేనేనీవనుకున్నా, దంపతులమధ్య కీచులాట రాకపోతుందా? వస్తుంది-తప్పకవస్తుంది. కొంతమంది ఆ కీచులాటనే ప్రణయకలహముగ ప్లేటుమార్చుకొని, దానిలోనుండే మాధుర్యాన్ని చవిచూస్తారు. కొంతమంది ఆ కీచులాటనే పెంచి పెద్దదిగ చేసుకొని, భార్యకు నాలుగు వడ్డించి, తను నాలుగురోజులు తిండి తిప్పలులేకుండ ఏ కాఫీహోటలులోనో తిష్టవేస్తారు. మరొకతెగవారు భార్యచేతనే నాలుగు బహుమతులు పొంది అంతవరకు తృప్తిజెంది బయటపడి కాలికి బుద్ధిచెప్పుతారు. మన రాముని ఏతరగతిలో కూర్చొనబెట్టుతారో ఆ భారము మీకే వదులుతాను.

రాముకు బండెడు కోపము. ఆ కోపానికి తోడు నిప్పుకు గాలితోడయినట్లు సుశీల విరుద్ధముగానే నడుస్తుంది. పోనీ వాండ్లిద్దరి మధ్యన వచ్చిన గొడవలు సరిదిద్దటానికి పెద్దవాండ్లెవ్వరైన ఆయింట్లో వున్నారంటె అదీలేదు. ఇద్దరేఇద్దరు. వాండ్లే అరుచుకోవాలి, వాండ్లె సర్దుకోవాలి. ఇంతకుముందెన్నో చిన్నచిన్నవి, పెద్దపెద్దవి కీచులాటలు వచ్చినవికాని అంతగవిషమించలేదు. ఒక వేళ విషమించినను మూడు, నాలుగురోజులకంటె ఎక్కువ కాలముండేది కాదు. మరలవెంటనే ఎవరోఒకరు పలకరించే వాండ్లు. తిరిగి ఎప్పటిలాగా బండి సాగిపోతుండేది. కాని ఈ సారి పెద్దబ్రేకు పడ్డది. ఇదివరకు బ్రేకులు పడినపుడు పక్కయింటి కాంతమ్మవచ్చి మెకానిజంలో తన నైపుణ్యమంతాచూపి ఇద్దరికి రాజిచేసి పోతుండేది. ఈ సారి ఆమె ఆటలేమిసాగ

లేదు. ఎన్నో చెప్పింది కాని ఫలితము సున్న.

ఎంత పెద్ద తగాదావచ్చినా రాము సుశీల వంటిమీదచేయిచేసికొని యెరుగడి దివరకు. అరిచినపుడరిచినా,మరల వెంటనే బజారునుండి రసగుల్లాలు నాలుగు తెచ్చి టేబిలుమీద పడేసేవాడు. రసగుల్లాలంటె సుశీలకు మహాయిష్టము. అంతటితో ఆగి పోయినబండి తిరిగి కదలుతుండేది. ఇపుడో రసగుల్లాలు లేవు మీదు మిక్కిలి చేయిచేసు కొన్నాడేమో తెలియదు. సుమారు పది రోజులైనవి ఎడమొగము పెడమొగము తోనె తిరుగుతున్నారు.

ఎవరికంచమువారిది ఎవరిమంచము వారిదైంది. రాము యింట్లో, సుశీల పంచలో పొయ్యిబెట్టినారు. చివరకు నాలుగురోజులు చూచాడురాము. కాని సుశీల పలకలేదు. పొయ్యిపెట్టి వుడకీవుడ కని నానపాలు, నలిగీ నలగని పచ్చడి తయారుచేసికొని తిని ఆఫీసుకు పోతుండే వాడు. వంట అయ్యేవరకు రాము పెద్దపులి వేషము వేసుకొనినవానిలాగా మసి, బూడిద వంటినిండ అయ్యేది. అన్నము పూర్తిఅయ్యేవరకు తలప్రాణము తోకకు వచ్చేది. ఆడవాండ్లదికూడ కష్టమైనపనేనని అప్పుడు తెలిసింది రాముకు. ఇంత అవస్థ పడుతున్నా కాస్త సహాయమైనచేయలేదు సుశీల.

ఊర్లో అమ్మలక్కలంత రాము, సుశీల నుగురించే ఆ పదిరోజులు ఎవరిష్టమొచ్చి నట్లు వాండ్లు మాట్లాడుకొన్నారు. 'పాపము రాము సుశీలకు కీచులాటవచ్చింది. కంచము, మంచము వేరైంది. పెరుగుట విరుగుట కొరకే అన్నట్లు అంత ప్రేమాగా నున్న అంత విరోదమొస్తది' అన్నది ఒక మొగుణ్ణి వదలిపెట్టిన సుబ్బమ్మ బావిలోకి చేదనువదులుతూ.

ప్రక్కనే వున్న లక్ష్మమ్మ "ఏ తప్పు చేయందీ ఎందుకు పోట్లాటవస్తుంది. ఏదో సుశీల తప్పుచేసివుంటుంది" అన్నది.

"సుశీల గడుసుపిల్ల మొగుడితో పోట్లాడి పదిరోజులనుండి తిండి వండిపెట్టడములేద"ట అని గోవిందమ్మ దొడ్డికెల్లుతూ నారాయణమ్మకు చెప్పుతూంది. "అవునులేమ్మ ఆ యబ్బాయి కూడ సరైనవాడుకాదుట ఎప్పుడు తగువులాడుతూంటాడట,కొడుతుం టాడట" అని అన్నది నారాయణమ్మ

"నిజమే అత్తయ్యా చిన్నదానికి పెద్ద దానికి కీచులాటేమిట త్తయ్యా-వాండ్లెప్పుడు తగువులాడుకుంటారు నేను వినలేక చస్తుం టాను" అని అన్నది నాగరత్తమ్మ.

"ఈరోజు తన్నుకుంటారు రేపు బాగుం టారు. ఇంతకు మనమే మధ్య పగ వాండ్లము. మనకెందుకులే వాండ్లగొడవ" అని అన్నది పక్కనకూచొనిన చెంచమ్మ.

సుశీలకు కడుపులో భయముపడ్డది. నలు గురునానావిధాలుగా అనుకోటమువిన్నది. సుశీల మనసుగాలిలో తెగిన గాలిపటము

లాగా కలత జెందినది. తుదకు సుశీలకు విసుగు పుట్టి అమ్మగారింటికి వెళ్లుదామను కొని కాంతమ్మచేత చెప్పించింది భర్తకు. వెళ్లమన్నాడే కాని వుండమనలేదు. వెళ్ల మన్నాడని సుశీలకు మరింత కోపము, కోపానికితోడు దిగులు పుట్టకొచ్చింది. తన సంసారము చీకాకు అవుతుందేమో నని, అమ్మగారింటికి పోతే మరల తీసుక రాడేమోనని భయపడింది. వాండు మాత్రమెన్నిరోజులు సాకగలరు. ఎప్పటి కైన తాలికట్టిన భర్తే పోషించాలిగాని ఇతరులెందుకు పోషిస్తారనుకొంది. ఇన్ని ఆలోచనలు చేస్తున్న ఆ బుర్ర భర్తను ముందుగ పలుకరించి మంచిచేసికొని, ఎప్పటిలాగున చిలక గోరింకల్లాగా వుండ కూడదా? ముందుగ పలకరించటానికి ఒప్పుకొనే సుశీలకాదు. సుశీల ఆత్మాభి మానముగలది. అట్లాగె చిన్నప్పటినుండి పెరిగింది తల్లిదండ్రుల చేతుల్లో. ఇప్పుడు కూడ అట్లుంటె కుదురుతుందా? తల్లి దండ్రులంటె ఒప్పుకున్నారు. భర్తెందు కొప్పుకుంటాడు. ఒప్పుకోడు. అందువలన సమయానుకూలముగ మనస్సును కట్టు బాటు చేసికొని భర్తకు విధేయతగా మెల గుతూ, పడవను ఋజుమార్గములో నడిపిం చాలి. లేనిచో ఇద్దరికి ప్రమాదమే.

"వాండ్ల వ్యవహారము శ్రుతిమిఞ్చిరా గాన పడేటట్లున్న"దని ప్రక్కింటి కాంతమ్మ, సుశీల తండ్రికి జాబు వ్రాసింది వారికి తెలి యకుండ. "మీఅల్లుడు, కూతురు పోట్లాడు కొని, కంచము, మంచము వేరే పెట్టు కొన్నారు. నా మాట వినలేదు, ఆలస్యము చేస్తే తీవ్రరూపము దాల్చును. నీవు వచ్చి సరిపెట్టిపోవలెను. అర్జంటుగా రావలె"నని.

వెంటనే సుశీలతండ్రి బయలుదేరి వచ్చి నాడుకాని సుశీల రాము ఇంటిలోలేరు. తలుపుకు తాళము వేసివుంది. ఆశ్చర్య పోయాడు. ప్రక్కింటి కాంతమ్మను అడిగి నాడు. "నాకు తెలియదన్నది ఎక్కడి కైన వెళ్లారెమో వస్తారు అప్పటివరకు తనింటిలో వుండమనింది." కాని సుశీల తండ్రికి మనసునిలువలేదు వాండ్ల కెందు కొచ్చిందో ఆ కీచులాట అని అడిగాడు.

ఒకరోజు రాత్రి "ఏమండీ నాకు అమ్మాయి పుట్టాలని కోరుకున్నది. పుట్టితే ఏమిపేరు పెడదామండి" అని అడిగిందట మీ కూతురు "చీ. పాడు అమ్మాయి- వాండ్లను సాకలేకచావాలి. అబ్బాయి పుట్టితే బాగుంటుంది. మనకక్కరకు వస్తాడు ఆడపిల్లలనెంత సాకిన మన యింట్లో వుండేవాండ్లుకాదు. పైగా కట్నాలు, కానుకలు మన మీరోజులలో తీసుకరాలేము. అబ్బాయి అయితే వాడే చదువుకొని, పెద్దవాడై, ఏదో ఒక ఉద్యోగము చేసుకొని బ్రతుకుతాడు. వాడితో దిగులుండదు. ఆడపిల్లలుంటే

దిగులుతో చావాలి. నీవు లేనిపోని కోరికలు కోరుతుంటావు'' అని రాము అన్నాడట. ''నాకమ్మాయే కావాలి. నేను పాడు పనంత చేసుకోలేకున్నాను. కాలికి చేతికి అడ్డమువస్తది, అమ్మాయి కావాలి'' అని సుశీల గట్టిగ అన్నదట. ''నేననిన దానికి కాదంటావా'' అని రాముకు కోపము వచ్చిందట. ''అమ్మాయి పుట్టితే తనయింటికి రావద్దన్నాడట.'' ''నీ యిష్టమేనా? నాకు కూడ యింటిలో అధికారమున్నది.'' అని సుశీలన్నదట. ''మీనాన్న సొమ్మిక్కడ లేదు. ఇది నాహక్కు మానాన్న సంపాదించిన''దనిరాము అన్నాడట. సుశీల వూరుకోనేమనిషి కాదు మాటమీద మాట అనేసింది. రాముకు కోపమువచ్చి చెయి చేసికొన్నాడు. ఇది జరిగినతగాదా'' అని కాంతమ్మ చెప్పేసరికి సుశీల తండ్రి వాండ్లను పిచ్చివాండ్లకు క్రింద లెక్క వేసుకొన్నారు. దేవుడు కలుగచేసేదానికి ముందుగ తగవులాడుకొని వేరుపోయినందుకు వాండ్లపిచ్చి చేష్టలను గురించి ఆశ్చర్య పోయాడు. తగవులాడుకొని ఎటు అయిన పోయినారేమోనని, ఎక్కడయిన పడ్డారేమోనని భయపడ్డాడు.

ఇంతలోనె రాము, సుశీల ముస్తాబై ఒక రిక్షాలోనె కూర్చొని సినిమాకువెళ్లి వస్తున్నారు. కాంతమ్మ చూచి ఆశ్చర్య పోయింది. వాండ్లిద్దరిని వింతమనుష్యులను కొంది.. సుశీల తండ్రికి మీ అల్లుడు కూతురొచ్చినారని చెప్పింది. సుశీల తండ్రి గుండెదడలు తగ్గినవి. సుశీల తండ్రికి ముందుగా అన్నము పెట్టింది సంతోషముతో. తిన్నతరువాత జరిగిన కాశీమజిలీ కథ చెప్పటానికి సుశీల సిగ్గుపడ్డది. ''నీవు చెప్పక పోయినా నాకు ముందుగానే తెలిసినదిలే.'' అన్నాడు సుశీల తండ్రి.

కాంతమ్మ వచ్చి ''ఏమటమ్మాయి నేనెంత చెప్పిన మీరు నా మాటవినలేదు. ఎట్లా రాజీ పడ్డారు'' అని అడిగింది. సుశీల ''కల మేలుచేసిందమ్మా'' అని అన్నది. ''ఏమికల, ఏమిజరిగిందమ్మాయి'' అని కాంతమ్మ వింతగా అడిగింది.

''ఒక పెద్దదెయ్యమో, రాక్షసుడో, తాటి చెట్టంతఎత్తు, నలుగురి మనుషుల లావు, నల్లగావచ్చి మీ మనుమడిమీద కూర్చొని, గుండెలమీద గుద్దుచున్నాడట ఊపిరాడక పెద్దగ అరిచాడు. నేను ప్రక్క మంచముమీద పండుకున్నాను కదూ? ఆ కేకవిని భయపడి, దొంగలనుకొని, వెర్రి కేకవేసి ఆయన మీదపడ్డాను. ఆయన ఉలిక్కిపడిలేచి, నన్ను బుజ్జగించి, భయము మాన్పి, దగ్గఱకు తీసికొని హత్తుకున్నారు. ఆభయముతో మరల నామంచముమీదికి పోలేదు. ఒకే మంచము, ఒకే కంచం'' మన్నది. ''మీరు బాగుంటే అదే పది వేలన్నది.'' కాంతమ్మ, సుశీల తండ్రి మూడోనాడు రైలు ఎక్కాడు.